# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- చౌక దుకాణాల ద్వారా జూన్ 1 నుంచి రేషన్ పంపిణీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.
- ఇతర దేశాల నుండి అక్రమ వలసల అరికట్టాల్సి ఉందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు.
- ఏపీ ఐసెట్-2025 ఫలితాలు ఈ రోజు విడుదలయ్యాయి.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 22న ఢిల్లీలో పర్యటించనున్నారు.
- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

=======================

చౌక దుకాణాల ద్వారానే రేషన్ పంపిణీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. జూన్ 1 నుండి ఈ విధానాన్ని అమలు చేయాలని తీర్మానించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన మంత్రి వర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వివరించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ)కి ఉచితంగా 615 ఎకరాల భూ కేటాయింపునకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని, అలాగే సత్యసాయి జిల్లా తాడిమర్రిలో ఆదాని పవర్ కు 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రోపవర్ ప్రాజెక్టుకు భూమి కేటాయించిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఐసెట్-2025 ఫలితాలు ఈ రోజు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ విడుదల చేశారు. ఐసెట్ పరీక్షను 34 వేల 131 మంది విద్యార్థులు రాయగా... 32 వేల 719 మంది అర్హత సాధించారు. ఈ పరీక్షలో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదైందని అధికారులు వెల్లడించారు. ఐసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు.

=====================

ఇతర దేశాల నుండి అక్రమ వలసల వల్ల రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అవుతోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ అంతర్గత భద్రత కూడా ఇబ్బందులలో పడుతోందని అన్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో పవన్ కల్యాణ్ ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడారు. అక్రమంగా వలస వచ్చే వారు స్థానికులుగా మారేందుకు సహకరిస్తున్న వారిపై కఠినమైన నిఘా ఉంచాలని ఆయన పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 22వ తేదీన ఢిల్లీ పర్యటన చేయనున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ పర్యటనలో భాగంగా 23వ తేదీన ముఖ్యమంత్రి పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. అదే విధంగా రాష్ట్రానికి పెట్టుబడులకు సంబంధించి పలువురు పారిశ్రామిక వేత్తలతో కూడా సమావేశం కానున్నారు. 24వ తేదీన భారత్ మండపంలో జరిగే నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. అదే రోజు రాత్రి తిరుగు ప్రయాణమై అమరావతి చేరుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

=====================

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) ఉప మేయర్ గా జనసేన పార్టీకి చెందిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు సంబంధించి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ రోజు ప్రత్యేక సమావేశం జరిగింది. ఉప మేయర్ పదవికి ఒక్కరే పోటీలో నిలవటంతో ఎన్నిక ఏకగ్రీవం అయినట్లుగా ప్రిసైడింగ్ అధికారి కే.మయూరి అశోక్ ప్రకటించారు.

విరామం

=====================

ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా ప్రజలు అంతా భారత సైనికుల శౌర్య పరాక్రమాలకు జేజేలు పలుకుతున్నారు. దేశం కోసం వీరోచితంగా పోరాడిన సాయుధ బలగాలకు నివాళిగా ఆకాశవాణి వార్తా విభాగం ప్రత్యేక కథనాన్ని అందిస్తోంది. ఇందులో భాగంగా కార్గిల్ యుద్ధంలో అసమాన ధైర్య సాహసాలను ప్రదర్శించిన పరమ వీర చక్ర అవార్డు గ్రహీత సంజయ్ కుమార్ గురించి ఈ రోజు తెలుసుకుందాం. కార్గిల్ యుద్ధంలో శత్రువు తూటాలతో శరీరం రక్తమోడుతున్న వారిని అంతమొందించేదాక పోరాటం చేసిన సంజయ్ కుమార్ గురించి ఒక్కసారి గుర్తు చేసుకుంటూ...

(వాయిస్ 39 సెకన్లు)

=====================

తిరుమలలోని అన్నమయ్యభవనంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి సమావేశం ఈ రోజు టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు అధ్యక్షతన జరిగింది. ఆ వివరాలను టిటిడి కార్యనిర్వహణాధికారి జె. శ్యామలారావు పాత్రికేయులకు వివరించారు. విశ్రాంత ఐఏఎస్ ఐవి సుబ్బారావ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ సిఫార్సులు మేరకు

స్విమ్స్ ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. టీటీడీలోని 29 మంది అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి పంపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. శ్రీవారి ఆలయ భద్రత దృష్ట్యా యాంటి డ్రోన్ టెక్నాలజీ తీసుకురానున్నామని తెలిపారు.

======================

యోగాతో ఆరోగ్యకర జీవితం సొంతమవుతుందని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక ఏర్పాట్లలో భాగంగా ఈ రోజు నెల్లూరులో జరిగిన మెగా యోగా సాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాబోయే నెల రోజులలో ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను కోరారు.

======================

అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణంలో "తిరంగా ర్యాలీ" ఈ రోజు నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు  వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై దేశభక్తిని చాటారు.

======================

"ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్" అవగాహన కార్యక్రమాలు జూన్ 15 నుండి జూన్ 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో సేవలు, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని  ఆయన చెప్పారు.

======================

భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణలకు దోహదం చేసే "టీ హబ్" ను రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలోని జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నామని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలియచేశారు. రాజమహేంద్రవరం గ్రామీణ మండలం బొమ్మూరులో గల నైపుణ్యాభివృద్ధి కేంద్రం కార్యాలయం, ఆవరణను అధికారులతో కలిసి ఈ రోజు కలెక్టర్ సందర్శించారు.

======================

పశ్చిమ మధ్య బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం ఇప్పుడు పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా దక్షిణ ఆంధ్ర,  ఉత్తర తమిళనాడును ఆనుకుని ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల మూడు రోజుల  వరకు వాతావరణ సూచనలను వాతావరణ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 15 సెకన్లు)

======================
======================